క్లుప్తంగా

జడ్చర్లలో విద్యుత్ అంతరాయం

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలోని బాదేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాత్రి 7.30గంటల నుంచి సరఫరా నిలిచిపోయింది. కాగా ఎందుకు నిలిచిపోయిందో తెలియక పట్టణవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రంగారావుతోటలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని భావించిన విద్యుత్ సిబ్బంది పట్టణంలో సరఫరా నిలిపివేశారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్ సమస్య కాదని గుర్తించారు. ఎక్కడ సమస్య వచ్చిందో తెలుసుకునేందుకు విద్యుత్ లైన్‌లో పరిశీలన చేస్తున్నారు. రాత్రి 9.40గంటల వరకు సమస్య ఎక్కడుందో తెలుసుకోలేకపోయారు. దీంతో విద్యుత్ పునఃరుద్ధరణ ఎప్పుడవుతుందో తెలియక పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు.

గ్రామీణ మీసేవలకు దరఖాస్తులు

నవాబుపేట: గ్రామీణ మీసేవ కేంద్రాల ఏర్పాటు కోసం దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని యన్మన్‌గండ్ల, ఇప్పటూర్, కాకర్లపహాడ్, పోమాల్, కారుకొండలో కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఆశావహులు దరఖాస్తు చేసుకుంటున్నారు. కాగా ఇప్పటికే 25 దరఖాస్తులు వచ్చాయని.. జిల్లా అధికారుల ఆదేశాల ప్రకారం ఎంపిక ఉంటుందని ఐకేపీ ఏపీఓ జీవరత్నం శనివారం తెలిపారు.

ఎస్పీని కలిసిన సేవాలాల్ సేన నాయకులు

నవాబుపేట: మండలానికి చెందిన సేవాలాల్‌సేన నాయకులు శనివారం జిల్లా కేంద్రంలో ఎస్పీ జానకిని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. వ్యవస్థాపకుడు భూక్య సంజీవ్‌నాయక్, రాజ్‌కుమార్‌నాయక్ ప్రేమ్‌కుమార్, హరి, చందర్‌నాయక్, వినోద్, మంగ్యానాయక్, హతిరాం తదితరులు ఉన్నారు.

పశువైద్యాధికారిగా మధుసూదన్

అడ్డాకుల: మండల పశువైద్యాధికారిగా డాక్టర్ మధుసూదన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఆయన మూసాపేట మండల పశువైద్యాధికారిగా పనిచేశారు. ప్రస్తుతం అడ్డాకులకు బదిలీ అయ్యారు. కాగా అడ్డాకులలో పశువైద్యాధికారిగా 12 ఏళ్ల నుంచి పని చేస్తున్న డాక్టర్ రాజేష్‌ఖన్న వనపర్తి జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఇదిలా ఉండగా మూసాపేటలో పోస్టు ఖాళీగా ఉండటంతో మధుసూదన్ ఇన్‌చార్జీగా బాధ్యతలు తీసుకున్నారు. ఇద్దరు పశువైద్యులను మాజీ ఎంపీపీ దయాకర్, మాజీ ఎంపీటీసీ భీమన్నయాదవ్ శాలువాతో సత్కరించారు.

చెక్కుల అందజేత

రాజాపూర్: మండల పరిధిలోని సింగమ్మగూడ తండాలో లబ్ధిదారులకు శనివారం కాంగ్రెస్ నాయకులు దుష్యంత్‌రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ ప్రజలకు ఒక వరమని ఆయన పేర్కొన్నారు. నాయకులు శ్రీనివాస్ నాయక్, గణేష్‌నాయక్, వెంకట్, నరహరి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని గత పార్లమెంట్ ఎన్నికలకు ముందు ప్రధాని ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండా కమిటీల పేరిట కాలయాపన చేస్తున్నారని ఎమ్మార్పీఎస్–ఆర్ఆర్ రాష్ట్ర అధ్యక్షుడు రాయికంటి రాందాస్ అన్నారు. ఆగస్టు 5న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించ తలపెట్టిన మాదిగల ధర్మ దీక్ష కరపత్రాలను శనివారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. 11వ వార్డు కౌన్సిలర్ శ్రీనివాసులు, నాయకులు సింగిరెడ్డి పరమేశ్వర్, రాజగాని అశోక్, మల్లెల అనిల్, పాతూరు రమేష్, తిరుమలయ్య, కాలే నరేందర్, బిక్షపతి, నగేష్, పద్మమ్మ పాల్గొన్నారు.

జడ్చర్లలో..

జడ్చర్ల టౌన్: పట్టణంలో చేపట్టిన కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బాల్‌రాజ్‌మాదిగ, వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు, మాచారం మాసయ్య, బాల్ నర్సింహులు, తుంగశ్యామ్, భీంరాజ్, సత్యారపు రాజు తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఖమ్మంలో ఈ నెల 28న జరిగే సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యుడు రాయల చంద్రశేఖర్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి రాంచందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా కార్యాలయంలో సంస్మరణ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. డివిజన్ కార్యదర్శి వెంకటేశ్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు దేవదానం తదితరులు పాల్గొన్నారు.

20 శాతం నిధులు కేటాయించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యకు ప్రభుత్వం కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో శనివారం నాయకులు నిరసన తెలిపారు. ఈమేరకు నాయకులు మహమూద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో కేవలం 7.3 శాతం మాత్రమే కేటాయింపులు సరికాదన్నారు. కాంగ్రెస్ తమ మేనిఫెస్టోలో 15 శాతం కేటాయిస్తామని ప్రకటించిందని, ఇప్పుడు హామీలకు భిన్నంగా వ్యవహరించిందని ఆరోపించారు. నవీన్, వెంకటేశ్వర్లు, రవీందర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ



డబుల్‌రోడ్డుగా మారనున్న మల్లేపల్లి నుంచి రంగారెడ్డిగూడ వరకు ఉన్న బీటీ రహదారి



గత కాంగ్రెస్ హయాంలో ఈద్గాన్‌పల్లి వద్ద దుందుభీవాగుపై నిర్మించిన బ్రిడ్జి

మొదలుకానున్న 'డబుల్ రోడ్ల' పనులు

రాజాపూర్: మండలంలోని రంగారెడ్డిగూడ, కల్లేపల్లి, మీదుగా ఈద్గాన్‌పల్లి, మల్లేపల్లి రాజాపూర్ వరకు ఉన్న ప్రస్తుత బీటీదారి డబుల్‌రోడ్డుగా మారనుంది. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.86 కోట్ల నిధులతో నియోజకవర్గంలో చేపట్టబోయే ఈ డబుల్‌రోడ్ల పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. అంతేకాకుండా బాలానగర్ నుంచి గంగాపూర్ వరకు రూ.56కోట్లతో డబుల్‌రోడ్డు పనులకు ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. గతంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో అగ్రహారం పొట్లపల్లి, రంగారెడ్డి గూడ గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. ఎన్నోళ్లుగా దుందుభీ నదిపై వంతెన లేకపోవడంతో ఈద్గాన్‌పల్లి నుంచి రాజాపూర్ మండలానికి వాగు పారితే రాకపోకలు కూడా ఉండేవి కావు. వైఎస్సార్ పుణ్యమా అంటూ అప్పటి ఎమ్మెల్యే మల్లురవి బ్రిడ్జిని మంజూరు చేయించడంతో ఆ గ్రామాలకు ఎన్నో ఏళ్లుగా ఉన్న ప్రధాన సమస్య తొలగింది. అంతేకాకుండా గతంలో రాజాపూర్ నుంచి తిరుమలాపూర్ వరకు గత ప్రభుత్వం డబుల్‌రోడ్డు ఏర్పాటు



బాలానగర్ మండల కేంద్రంలో డబుల్‌రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు(ఫైల్)

చేసింది. అక్కడి నుంచి నవాబుపేట్ వరకు పెండింగ్ ఉన్న వర్క్ పూర్తి చేసేందుకు డబుల్‌రోడ్డుగా మార్చేందుకు రూ. 20 కోట్ల నిధులతో చేపట్టనున్నారు. ప్రస్తుతం ఆయా దారులన్నీ డబుల్ రోడ్లుగా మారబోతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భూముల ధరలకు రెక్కలు..

డబుల్ రోడ్లు ఏర్పాటు కానున్న నేపథ్యంలో ఆయా గ్రామాల్లో భూముల ధరలు అమాంతం పెరుగుతున్నాయి. రాజాపూర్ నుంచి కల్లేపల్లి, ఈద్గాన్‌పల్లి, మల్లేపల్లితకో పాటు బీబీనగర్, ప్రేమ్లీతండా చుట్టు పక్కల భూములకు ఒక్కసారిగా ధరలు రెట్టింపు కంటే ఎక్కువగా పలుకుతున్నాయని స్థానికంగా చర్చించుకుంటున్నారు. గతంలో ఈగ్రామాల రోడ్లకు చుట్టు పక్కల రూ. ముప్పై లక్షల నుంచి రూ. నలభై లక్షల వరకు ఎకరం ధర ఉండగా.. ప్రస్తుతం రూ. డెబ్బై లక్షల నుంచి రూ. ఎనభై లక్షల వరకు ఎకరం పలుకుతోందని తెలుస్తోంది.

ఎంతో సంతోషంగా ఉంది



మా గ్రామాలకు ఉన్న బీటీదారి డబుల్‌రోడ్డుగా మారుతుండటం ఎంతో సంతోషంగా ఉంది. గతంలోనూ కాంగ్రెస్ హయాంలో బ్రిడ్జిలతో పాటు బీటీరోడ్లు కూడా వేశారు. బ్రిడ్జిలు లేకముందు సైతం వాగు దాటాలంటే మాకు చాల గోస ఉండేది. ప్రస్తుతం సమస్యలు అన్నీ తీరనున్నాయి. అదేవిధంగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా కల్పిస్తే బాగుంటుంది.

– మహేష్‌యాదవ్, పాడిరైతు, ఈద్గాన్‌పల్లి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని.. ప్లాస్టిక్‌ను సాధ్యమైన మేరకు నివారించి పర్యావరణాన్ని కాపాడాలని మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి సూచించారు. శనివారం స్థానిక 47వ వార్డు పరిధిలోని కొత్తగంజి, హనుమాన్‌నగర్‌లలో బీజేపీ నాయకుడు దర్పల్లి హరికృష్ణ ఆధ్వర్యంలో ప్రజలకు జూట్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 30వ వార్డు కౌన్సిలర్ చెన్న వీరయ్య, స్థానిక నాయకులు వీరన్న, బోయ శ్రీను, నర్సింహ, బోడ రాజు, వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



జూట్ బ్యాగ్‌లు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తదితరులు

వన మహోత్సవంలో లక్ష్యం పూర్తిచేయాలి

జడ్చర్ల టౌన్: వనమహోత్సవంలో మండలానికి ఇచ్చిన లక్ష్యం పూర్తిచేయాలని డీఆర్‌డీఓ నర్సింహులు సూచించారు. శనివారం నసురుల్లాబాద్‌లో నిర్వహించిన వనమహోత్సవంలో పాల్గొన్నారు. మొక్కలు నాటి నీళ్లు పోశారు. అనంతరం మండలానికి నిర్దేశించిన లక్ష్యం ఎంతవరకు చేరుకున్నారని అడిగి తెలుసుకున్నారు. మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాలలో కొనసాగుతున్న అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ పనులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం గురించి ఆరాతీశారు. విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీడి శ్రీపాద్, ఏపీఓ విజయభాస్కర్‌లు పాల్గొన్నారు.



మొక్కనాటి నీళ్లు పోస్తున్న డీఆర్‌డీఓ నర్సింహులు

ఫీవర్ సర్వే పర్యవేక్షించిన మున్సిపల్ కమిషనర్



మాట్లాడుతున్న కమిషనర్ రాజయ్య

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న ఫీవర్ సర్వేను కమిషనర్ ఎస్.రాజయ్య శనివారం పర్యవేక్షించారు. 3వ వార్డు గౌరీశంకర్ కాలనీలో ఆయన పర్యటించారు. డెంగీ, మలేరియా, కలరా వంటి వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కాలనీ వాసులకు సూచించారు. వైద్యసిబ్బంది చేస్తున్న సర్వేకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అర్బన్‌హెల్త్ సెంటర్ సూపర్‌వైజర్ శివకుమార్, వార్డు అధికారి కృష్ణయ్య, ఆర్‌పీలు సరిత, స్వాతి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అవగాహన అవసరం

నవాబుపేట: అంటువ్యాధులపై అవగాహన కలిగి ఉండి.. అవి సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ భాస్కర్ సూచించారు. శనివారం మండలంలో పర్యటించిన ఆయన కాకర్లపహాడ్‌లో వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యవేక్షణ విధిగా చేయాలన్నారు. డ్రైడేలు నిర్వహించాలని.. ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మండల వైద్యాధికారి డాక్టర్ నవీన్‌చంద్ర, సిబ్బంది శ్రీనివాస్, శరభలింగం, రాఘవేందర్, పద్మ, జ్యోతి తదితరులు ఉన్నారు.



వ్యాక్సినేషన్ పరిశీలిస్తున్న అధికారులు

కులగణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌సాగర్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశఋరు. ఓటర్ల జాబితా ఆధారంగా రిజర్వేషన్లు అమలుచేస్తే రాష్ట్ర వ్యాప్తంగా బీసీ ఉద్యమం రావడం ఖాయమని తెలిపారు. కులగణన లెక్కలు తేలగానే 90 శాతం అణగారిన కులాలకు రాజ్యాధికారం కావాలని ఉద్యమాలు చేస్తారనే భయంతో ప్రభుత్వం సర్వే పక్కన పెట్టిందని ఆరోపించారు. సర్వే చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం ఒక పెద్ద సామాజిక విప్లవాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. దేశంలో బీసీలు జీవితకాలమంతా రాజకీయ నాయకులకు ఓటు వేసే యంత్రాలుగా బతకాల్సిందేనా అని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు గడిచినప్పటికీ బీసీల జనాభాను లెక్కించేందుకు పాలకవర్గాలు జంకుతున్నాయన్నారు. అసెంబ్లీలో సగం వాటా కోల్పోతామనే భయంతోనే బీసీ కులగణనను చేయడానికి పాలకులు ముందుకు రావడం లేదన్నారు. బీసీల విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి సిఫార్సులు చేయాలంటే జనాభా లెక్కలు కావాల్సి ఉంటుందన్నారు. పైగా ప్రభుత్వ అభివృద్ధి పథకాలకు, రిజర్వేషన్లకు, పరిపాలన సౌలభ్యం కోసం కులాల వారీగా లెక్కలు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్రాలు వెనుకబడిన తరగతులకు రాజ్యాంగబద్ధమైన కులగణనతోపాటు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ప్రకటించేంతవరకు బీసీల పోరాటం ఆగదని హెచ్చరించారు.

ఉపాధ్యాయవృత్తి పవిత్రమైంది

నవాబుపేట: ఉపాధ్యాయవృత్తి పవిత్రమైందని.. అలాంటి వృత్తి నిర్వహిస్తుండడం అదృష్టంగా భావించాలని మండల విద్యాశాఖ అధికారి రాజునాయక్ తెలిపారు. శనివారం మండల కేంద్రంతో పాటు దయాపంతులపల్లి ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుల వీడ్కోలు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులను గ్రామస్తులు, విద్యార్థులు సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, నోట్‌బుక్స్, పెన్నులు అందించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం నాగ్యనాయక్, సీఆర్‌పీ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులతో విద్యార్థులు

మహిళ బైండోవర్

గండీడ్: నిబంధనలకు విరుద్ధంగా సారా కాస్తున్న ఓ మహిళను ఎక్సైజ్ అధికారులు గండీడ్ తహసీల్దార్ ఎదుట శనివారం బైండోవర్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కొండెడ్డిపల్లికి చెందిన లక్ష్మీబాయి నిబంధనలకు విరుద్ధంగా సారా కాస్తోంది. దీంతో నిఘాపెట్టిన ఎక్సైజ్ అధికారులు ఆమెను పట్టుకున్నారు. తహసీల్దార్ నాగలక్ష్మి ఎదుట బైండోవర్ చేశారు. మరోమారు ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఆర్ఐ యాసిన్, ఎక్సైజ్ అధికారులు ఉన్నారు.

పెట్రోల్ తెస్తానని వెళ్లి వ్యక్తి అదృశ్యం

జడ్చర్ల: బైక్‌లో పెట్రోల్ అయిపోవడంతో తీసుకువస్తానని బాటిల్‌తో వెళ్లిన వ్యక్తి మూడు రోజులు గడిచినా తిరిగి రాని ఘటన జడ్చర్లలో చోటుచేసుకుంది. సీఐ ఆదిరెడ్డి కథనం మేరకు..బాదేపల్లి పాత బస్టాండ్ సమీపంలో ఓ అద్దె ఇంటిలో ఆలూరుకి చెందిన ఆటో డ్రైవర్ పానుగంటి విజయ్‌కుమార్(27) తన భార్య లావణ్యతో కలిసి జీవనం కొనసాగిస్తున్నారు. ఈ నెల 24న తన బైక్‌లో పెట్రోల్ అయిపోవడంతో తీసుకువస్తానంటూ భార్యకు చెప్పి బాటిల్ తీసుకుని ఇంటి నుంచి వెళ్లిన విజయ్‌కుమార్ మూడు రోజులు గడిచినా తిరిగి రాలేదు. అతడి ఫోన్‌కు కాల్ చేయగా స్విచ్ఆఫ్ వస్తోందని కుటుంబ సభ్యులు తెలిపారు. చుట్టు పక్కల గాలించినా ఆచూకీ లభించలేదన్నారు. ఫలితం లేకపోవడంతో విజయ్‌కుమార్ సోదరుడు నర్సింహ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

ఆర్థికసాయం

అడ్డాకుల: మండలంలోని తిమ్మాయిపల్లి తండాకు చెందిన మణెమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని శనివారం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎన్.రాజశేఖర్‌రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. అదే తండాకు చెందిన కోటా నాయక్ ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. రాచాలలో ఇటీవల మృతి చెందిన లక్ష్మణ్‌గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. వింగ్ అధ్యక్షుడు ఎం.జితేందర్‌రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, చక్రపాణిరెడ్డి ఉన్నారు.

హన్వాడ: ఇబ్రహీంబాద్‌కి చెందిన భూనీటి బుచ్చమ్మ వయోభారంతో శుక్రవారం మృతిచెందారు. ఆమెకు ఎవరూ లేకపోవడంతో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సురేందర్‌రెడ్డి అంత్యక్రియల ఖర్చులకు ముందుకు వచ్చారు. రూ.10వేలు మండల అధ్యక్షుడు మహేందర్‌తో పంపిణీ చేయించారు.

గాధిర్యాల్‌లో పారిశుద్ధ్య చర్యలు



మహమ్మదాబాద్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గాధిర్యాల్‌లో పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగిపోయాయి. ఈగలు, దోమలు వ్యాపిస్తున్నాయి. దీంతో గడ్డిమందులు పిచికారీ చేస్తున్నట్లు, పారిశుద్ధ్య చర్యలు చేపట్టినట్లు కార్యదర్శి హాజీ తెలిపారు. శనివారం ఈ మేరకు పంచాయతీ వర్కర్లతో మందులు పిచికారీ చేయించారు. ఎక్కడా మురుగునీరు మలిచినా వెంటనే తొలగించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. సిబ్బంది పాల్గొన్నారు.

వెన్నాచేడ్ కార్యదర్శిగా కృష్ణనాయక్

గండీడ్: వెన్నాచేడ్ కార్యదర్శిగా కృష్ణనాయక్ బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన ఖలీమ్ బాల్‌నగర్ మండలంలోని బోడగుట్టతండాకు బదిలీపై వెళ్లారు. కాగా కృష్ణనాయక్ వనపర్తి నుంచి ఇక్కడకు వచ్చారు.

హన్వాడ: తిరుమలగిరికి బదిలీపై వచ్చిన పంచాయతీ కార్యదర్శి సుభద్రను గ్రామస్తులు శనివారం ఘనంగా సన్మానించారు. మహమ్మదాబాద్ మండలం కంచిమిపల్లి నుంచి సుభద్ర ఇటీవల జరిగిన బదిలీల్లో తిరుమలగిరికి వచ్చారు. కాగా ఇదివరకు ఇక్కడ పనిచేసిన రాఘవేందర్ అత్యకుంటతండాకు బదిలీపై వెళ్లారు. మునయ్య, వెంకటయ్య, రాంరెడ్డి, సుక్కప్ప పాల్గొన్నారు.

జడ్చర్లలో ప్రత్యేక బలగాల ఫ్లాగ్‌మార్చ్

జడ్చర్ల: పట్టణంలో ప్రత్యేక పోలీసు బలగాల ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. స్థానిక సీఐ ఆదిరెడ్డి ఆధ్వర్యంలో నిమ్మబాయి గడ్డ నుంచి కావేరమ్మపేట వరకు శనివారం ఈ కవాతు చేపట్టారు. ప్రజలకు శాంతిభద్రతల విషయంలో భరోసా కల్పించేందుకు కార్యక్రమం చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.



మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

దుష్ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు

జడ్చర్ల: పురపాలిక సభ్యులపై కొందరు తమ ఇష్టానుసారంగా దుష్ప్రచారం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని.. అలాంటి వారిపై చట్టపరంగా ముందుకు వెళ్తామని బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు తెలిపారు. శనివారం మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చైర్‌పర్సన్‌పై అవిశ్వాస సమయంలోను తమపై దుష్ప్రచారం చేశారని ఆరోపించారు. ఇప్పుడు కూడా ఎవరికి వారు అపోహలు కల్పిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేస్తామన్నారు. కొత్త చైర్‌పర్సన్ ఎంపికకు సంబంధించి రూ.కోట్లు, లక్షలు చేతులు మారుతున్నాయని కౌన్సిలర్లపై నిందలు వేస్తూ తమ మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక నుంచి ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కొత్త చైర్‌పర్సన్ అభ్యర్థిని తమ అధినేత మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆదేశాలతో తామంతా ఏకగ్రీవంగా ముందుగానే ప్రకటిస్తామన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు చైతన్య, శ్రీశైలమ్మ, హరిత, నవనీత, దేవ, సతీష్ నాయకులు రాంమ్మోహన్, మురళి, నర్సింహ్మాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి



వెన్నాచేడ్ మోడల్‌స్కూల్‌లో వంటలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ దేవన్న

గండీడ్: మధ్యాహ్న భోజనం విషయంలో వంటల ఏజెన్సీలు నాణ్యత పాటించాలని గండీడ్ ఎంపీడీఓ దేవన్న సూచించారు. శనివారం వెన్నాచేడ్ మోడల్ స్కూల్‌లో వంటలను పరిశీలించారు. పలు సూచనలు చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఆహారంతోపాటు వేడినీళ్లను కూడా అందించాలని తెలిపారు. వర్షాకాలం సీజన్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం రామయ్యబౌలీలో శుక్రవారం రాత్రి హజ్రత్ షేక్ రఫీయోద్దీన్‌షా ఖాద్రీ, హజ్రత్ షేక్ అబ్దుల్ రహిమాన్ హుస్సేన్‌షా ఖాద్రీ షర్ఫీ గంధోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూలు, చాదర్లు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. అనంతరం దర్గా సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో 9వ ధార్మిక సభ నిర్వహించారు. కర్నూల్‌కు చెందిన ప్రముఖ ధార్మికవేత్త హుస్సేన్ పీర్ హుస్సేని సందేశం ఇచ్చారు. ప్రతి ఒక్కరూ ధర్మమార్గంలో నడవాలని కోరారు. ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మహ్మద్ అబ్దుల్ మొయిజ్, అబ్దుల్ మొహిమిన్, ముతవల్లీ షేక్ సైఫొద్దీన్ ఖాద్రీ, బుర్హాన్ ఖాద్రీ, జహంగీర్‌పాష ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మతపెద్దలు

'స్థానిక' ఎన్నికలకు సిద్ధం కండి



నవాబుపేటలో మాట్లాడుతున్న బ్రహ్మాచారి

నవాబుపేట: స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ కార్యకర్తలు సిద్ధం కావాలని రాష్ట్రకార్యవర్గ సభ్యుడు బ్రహ్మాచారి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో అధ్యక్షుడు రాజు అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బ్రహ్మాచారి పాల్గొని ప్రసంగించారు. స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు యాదయ్య, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, గోపాల్ పాల్గొన్నారు.

దేవరకద్ర: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి మంచి మెజార్టీని ఇచ్చారని అదే స్ఫూర్తి స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు కలిసి కట్టుగా పని చేయాలని రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి బురుజు రాజేందర్‌రెడ్డి కోరారు. శనివారం మండల బీజేపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ఓబీసీ కార్యదర్శి దేవన్న, జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శి రాచాల రాజు, నాయకులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో సీనియర్ నాయకులు రాములు, జిల్లా కోశాధికారి పాండురంగారెడ్డి, మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు వెంకట్రామిరెడ్డి, రాములుగౌడ్, శ్రీధర్, నర్సిములు, రంగన్న, పార్థసారథి, వేణు, శ్రీకాంత్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: మండల కేంద్రంలో సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, మండల అధ్యక్షుడు నరేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, బీజేవైఎం అధ్యక్షుడు తిరుపతి, మహిళ మోర్చ అధ్యక్షురాలు సాహితి రెడ్డి, రాజేందర్ రెడ్డి, రవిగౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి, వాసుదేవ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం



రాజాపూర్: కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలకు సముచిత న్యాయం చేస్తున్నారని సీనియర్ నాయకులు జనంపల్లి దుష్యంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఎస్సీ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేయడంపై హర్షం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలో ఎస్సీసెల్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. నరహరి, శ్రీనివాస్‌నాయక్, కృష్ణయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.